క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కేటీదొడ్డి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హరికృష్ణ మండల ప్రజలకు సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మట్టితో కట్టిన ఇళ్లు, పాత నివాసాల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ స్తంభాలను తాకకుండా జాగ్రత్త పడే విధంగా అప్రమత్తం చేయాలన్నారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తున్నాయన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు అప్రమత్తంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ధరూరు: రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌కేబీఎస్) తరపున మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం, ఎంజేపీ మహిళా గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, వార్డెన్ నర్సింహులు, ఫార్మసిస్టు పరుశరాం, ఏఎన్ఎం ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరం పరిష్కరించాలి



అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి మేకలు మృతి



శాంతినగర్: మండంలోని రామాపురంలో వర్షాలకు గోడకూలి రెండు మేకపోతులు, మేక మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మేకల కాపరి వెంకట్రాముడు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వడ్డేపల్లి డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ప్రభుత్వ పరంగా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాలి



ఇటిక్యాల: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉదండాపురం సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా గర్భిణులకు సహజ కాన్పులపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటివి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొని పెను ప్రమాదం తప్పిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ మురళీ తెలిపిన వివరాలు.. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు. కోదండాపురం సమీపంలోని రెడ్డి దాబా వద్ద సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న జీప్ వేగాన్ని నియంత్రించలేక కారును ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జీప్ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



గట్టు చెరువు కాల్వ ద్వారా వస్తున్న వర్షపు నీరు



కాశీపురంలో చెరువులను తలపిస్తున్న రోడ్లు



ఉత్తనూరు వాగులో వరద ప్రవాహంలో ఆర్టీసీ బస్సు

పొంగుతున్న వాగులు వంకలు

- లోతట్టు కాలనీలు జలమయం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం



అలంపూర్ మండలం కాశీపురం వద్ద వాగు దాటుతున్న గ్రామస్తులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు కాలనీలు, పంట పొలాలను వరద ముచ్చెత్తుతోంది. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఏర్పడింది.

– అలంపూర్ నియోజకవర్గంలో సోమవారం తెల్లవారుజాము నుంచి కుండపోతగా భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అలంపూర్ మండలంలోని కాశీపురంలో పల్లెవాగు భారీ వర్షలకు మరోసారి ఉప్పొంగి రోడ్డుపై నుంచి నీళ్లు ప్రవహించాయి. లింగనవాయిలో రోడ్డుపై రెండు అడుగుల మేర నీళ్లు పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

❖ కేటీదొడ్డి మండలంలో 29.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. పత్తిచేలు, వరి పొలాల్లో వరద చేరడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

❖ ఉండవెల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మోస్తారు వర్షం కురవడంతో పాఠశాలలకు ముందస్తు సెలవులు ప్రకటించారు. మెన్నిపాడు వాగును తహసీల్దార్ ప్రభాకర్, కార్యదర్శి జుబేర్ పరిశీలించారు. పుల్లూరులో నదిలోకి, ఒడ్డుకు ప్రజలు పోకుండా చాటింపు వేయించినట్లు తెలిపారు. మారమునగాల వాగును, కృష్ణా నది ఒడ్డును ఎస్ఐ శేఖర్ పరిశీలించారు.

❖ మానవపాడులోని వాగులను తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, ఎంపీడీఓ రాఘవ, ఎస్ఐ చంద్రకాంత్ పరిశీలించి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

❖ అయిజ – ఉత్తూరుల మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

❖ అలంపూర్ మండలంలోని కాశీపూరం గ్రామంలోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

❖ గట్టు మండంలో ఇందువాసి, బోయలగూడెం గ్రామాల మధ్యన ఉన్న వాగు పొంగి పొర్లింది. రోడ్డు కోతకు గురికావడంతో సోమవారం గట్టు పోలీసులు వాగు వద్ద తాత్కాలికంగా మట్టిని వేసి రాకపోకలకు చర్యలు తీసుకున్నారు.

❖ గట్టు మండల కేంద్రం మినహా గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గట్టు చెరువు కాల్వ ద్వారా వర్షపు నీరు చెరువులోకి వచ్చి చేరుతుంది. వర్షాలకు తెగిన మడికట్లను రైతులు సరి చేసుకుంటున్నారు. మరో వైపు సీడ్ పత్తిని సాగు చేసిన రైతులను ఎడతెరపిలేని వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. క్రాసింగ్ చేసినప్పటికి వర్షానికి మొగ్గలు నిలబడడం లేదని రైతులు వాపోతున్నారు.



మానవపాడు- అమరవాయి వాగును పరిశీలిస్తున్న అధికారులు



కేటీదొడ్డిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగు



చెన్నిపాడు- మానవపాడు వాగు వద్ద కోతకు గురైన రోడ్డు

ఎడతెరపి లేని వర్షం.. పలు ఇళ్లు నేలమట్టం



వల్లూరులో భారీ వర్షానికి కూలిన మట్టిమిద్దె



మాన్‌దొడ్డిలో కూలిన మట్టి మిద్దె

రాజోళి/శాంతినగర్/ఇటిక్యాల/ఎర్రవల్లి: రాజోళి మండలంలోని మాన్‌దొడ్డిలో బోయ పద్మావతికి చెందిన పాత మట్టిమిద్దె సోమవారం కూలింది. అ దే విధంగా మండల కేంద్రంలో మాబీ అనే మహిళ గుడిసె పాక్షికంగా దెబ్బతినడంతో అధికారు లు వారి సురక్షిత ప్రాంతాలకు తరించారు. కూలిన ఇళ్లను ఎస్ఐగోకారి, ఎంపీడీఓ భాస్కర్, పంచా యతీ సెక్రటరీలు కృష్ణయ్య, వీరేష్ పరిశీలించారు.

❖ వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం తదితర గ్రామాల్లో ఇప్పటివరకు నాలుగు ఇళ్లు కూలినట్లు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. మండల పరిధిలోని జూలెకల్‌లో బోయ కొండలమ్మకు చెందిన ఇళ్లు పైకప్పు కూలుతు ఇంట్లో నివసించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటిని పరిశీలించి కార్యదర్శి సత్యకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తలదాచుకోవాలని సూచించారు.

❖ ఇటిక్యాల మండల పరిదిలోని చాగాపురం, సాతర్ల, ఉదండాపురం గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్లను ఆర్ఐ మధు అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో జేఈ ఈశ్వర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

❖ ఎర్రవల్లి మండలంలోని కొండేరు, పుటాన్‌దొడ్డి, సాసనూలు, వల్లూరు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఆరు మట్టి మిద్దెలు కూలాయి. కూలిన ఇళ్లను అధికారులు పరిశీలించారు.



రాజోళి పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



ఉండవెల్లి- బూడిదపాడుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

ఘనంగా నందికోల సేవ



గట్టులో నందికోలు ఆడిస్తున్న వీరశైవలింగాయత సంఘం నాయకులు



బైరాపురంలో..

గట్టు: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా మండల కేంద్రంలో వీరశైవలింగాయతులు నందికోల సేవ ఘనంగా నిర్వహించారు. బంగారు బసవేశ్వర దేవాలయం నుంచి నందికోలును చెరువుకట్ట దగ్గరున్న రామలింగేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. దేవాలయంలో పూజలను నిర్వహించిన అనంతరం నాట్యం చేసుకుంటూ ఊరేగింపుగా బంగారు బసవేశ్వర దేవాలయం వరకు తీసుకొచ్చారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత సంఘం నాయకులు చంద్రశేఖర్, చిప్పె మల్లయ్య, రమేష్, శివకుమార్, సుధీర్, కిషోర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం ప్రత్యేక పూజలు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలోని శివాలయంలో శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. నిత్య భవన ఆశ్రమం నుంచి శివాలయం వరకు నందికోలసేవతో స్వామిని ఊరేగించారు.

సద్దలోనిపల్లిలో ప్రత్యేక పూజలు

మల్దకల్: సద్దలోనిపల్లి శ్రీకృష్ణస్వామి ఆలయంలో జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవంలో పాల్గొన్న ఆమెకు అర్చకులు తీర్థప్రసాదాలు, మొమెంటో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, గోపాల్, ఆంజనేయులు, రామకృష్ణ, లవన్న తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సెలవులు మంజూరు చేయాలి

రాజోళి: వర్షాలు కురుస్తున్న సమయంలో పాఠశాలలకు సెలవులు ఇవ్వకపోతే ఎలా అని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం పలు పాఠశాలల్లో వర్షపు నీరు నిలిచి, ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంటే ఎంఈఓ సెలవు ప్రకటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మండలంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈఓ భగీరథరెడ్డిని వివరణ కోరగా సెలవు ప్రకటన అందే వరకు సమయం ఉదయం 8 గంటలు దాటిందని, అప్పటికే పిల్లలు పాఠశాలలకు చేరుకున్నారన్నారు. మండల పరిధిలోని పాఠశాలల భవనాలు పరిశీలించామన్నారు. పాఠశాలల భవనాలకు ఎలాంటి ముప్పు లేదని, ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

పంటసాగులో జాగ్రత్తలు పాటించాలి



అలంపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి నాగార్జున్‌రెడ్డి

అలంపూర్: పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్‌రెడ్డి అన్నారు. అలంపూర్ శివారులోని పత్తి, మొక్కజొన్న పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. మండలంలో వానాకాలం సీజన్‌లో పత్తి 2,135 ఎకరాలు, మొక్కజొన్న 7,100, కంది 1,035, వరి 603 ఎకరాల్లో సాగ చేసినట్లు తెలిపారు. పత్తి పొలాల్లో నిలిచిన నీటిని కాలువలు చేసి బయటికి పంపించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించుకోవడానికి అంతర సేద్యం చేయాలన్నారు. బురద పదనులో ఎకరాకు 25 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి మొక్క మొదళ్లలో తడపాలన్నారు. మొక్కజొన్న పంట అధిక తేమను తట్టుకోలేదు కనుక సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం, రైతులు పాల్గొన్నారు.

గమ్యాన్ని చేరుకోవడంలో రాజీపడొద్దు



మాట్లాడుతున్న ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి

రాజోళి: విద్యార్థులు తమ గమ్యాన్ని చేరుకోవడంలో రాజీ పడొద్దని ఎస్ఐ గోకారి అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి, ఎస్ఐ మాట్లాడారు. బాలల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేధింపులకు గురైన వారు 1098, 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న వసతులను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు, ఎంపీహెచ్‌యూ రామకృష్ణ తదిదరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



అలంపూర్ చౌరస్తాలో పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

అలంపూర్/ ఇటిక్యాల/ఎర్రవల్లి/గట్టు/మానవపాడు/శాంతినగర్/ధరూరు: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు ముందుకెళ్లాలని గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ కూడలిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు గౌడ సంఘం అధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన ధైర్య సాహసాలు కొనియాడారు. గీత కార్మికులు ఐక్యతగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రవి ప్రకాష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రేఖగౌడ్, శేషన్‌గౌడ్, నరేందర్‌నాయిడు, నర్సన్‌గౌడ్, మక్బుల్‌బాష, కాంగ్రెస్ నాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

❖ ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ వీరభద్రప్ప పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ నందిని, ఆర్ఐలు మధు, మనోహర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

❖ ఎర్రవల్లి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్ సిబ్బందితో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ప్రధాన కూడలిలో జై నడిగడ్డ యువత జిల్లా కన్వీనర్ పల్లెరాజు, బీఎస్పీ జిల్లా అధోయక్షుడు రాంబాబు వివిద సంఘాల నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

❖ గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటన్నగౌడ్, నాయకులు పెద్దరామన్‌గౌడ్, పెద్ద ఈరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తహసీల్దార్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నాగిరెడ్డి, ఆర్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

❖ మానవపాడు: మండల కేంద్రంలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఆర్ఐలు గురురాజ్, రవితేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

❖ వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో పాపన్నగౌడ్ జయంతి వేడుకలు గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు రాధక్రిష్ణగౌడ్, రాజోళి మండల అధ్యక్షుడు జయన్నగౌడ్, మద్దిలేటిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

❖ ధరూరులో తహసీల్దార్ నరేందర్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిసెంట్ తిరుమలేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో నివాళులర్పిస్తున్న అధికారులు



ఎర్రవల్లి కూడలిలో నివాళులర్పిస్తున్న నాయకులు



మానవపాడు తహసీల్దార్ కార్యాలయంలో..



గొర్లఖాన్‌దొడ్డిలో ..



శాంతినగర్‌లో ..